## క్లుప్తంగా

### పాఠశాలలో డీడీ తనిఖీ

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం ఆశ్రమ పాఠశాలను శనివారం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ సందర్శించారు. తరగతి గదులు, వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారో లేదో తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డీడీ సూచించారు.

### 54 కేజీల లడ్డూ ఆవిష్కరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం వద్ద కొలువుదీరిన వినాయకుడి వద్ద 54 కేజీల లడ్డూను శనివారం ఎస్సై సురేష్ కుమార్ ఆవిష్కరించారు. స్వామివారి చేతిలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. 42 గంటల పాటు లడ్డూను ప్రత్యేకంగా తయారు చేశారు. గత ఏడాది లడ్డూ ధర లక్ష రూపాయలు పలకగా ఈ ఏడాది లడ్డూ ఎంత ధర పలుకుతుందో అని స్థానికులు ఇప్పటినుంచే చర్చించుకుంటున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్, ఎంపీటీసీ కమటం నరేష్, మిట్టకంటి వెంకటరెడ్డి, కాసరబాద సందీప్, పాటి మన్మథరెడ్డి, పర్వత నరేష్, వెంకటరెడ్డి, కళాధర్, శ్రీనివాసరెడ్డి, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల ప్రతిభ

అశ్వారావుపేటరూరల్: జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో అశ్వారావుపేటలోని ప్రభుత్వ ముస్లిం మైనార్టీ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. ఈ మేరకు శనివారం కళాశాల ప్రిన్సిపాల్ టి.సంగీత మాట్లాడుతూ.. స్థానిక వ్యవసాయ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో కళాశాలకు చెందిన మవ్వ అనే విద్యార్థి 800 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం, లాంగ్ జంప్ విభాగంలో శైలజ తృతీయ స్థానంలో, షాట్ పుట్ విభాగంలో ఎండి.సన తృతీయ స్థానంలో, వాలీబాల్ పోటీల్లో ఫర్హీన్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, శిక్షణ అందించిన పీఈటీ ప్రేమరాణిని ప్రిన్సిపాల్ అభినందించారు.

### బీజేపీతో భద్రాద్రి అభివృద్ధి

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాద్రి అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ నేత, మాజీ ఎంపీ గరికపాటి రామ్మోహన్ రావు అన్నారు. భద్రాచలం పట్టణంలోని ఎస్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన బీజేపీ నియోజకవర్గ పోలింగ్ బూత్ సమ్మేళన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ నుంచి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి, మాజీ ఎంపీ చాడా సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, చింతా సాంబమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రం రాజు బెహరా, చెరుకూరి సతీష్, నాగబాబు, లక్ష్మి పాల్గొన్నారు.

### ప్రగతిపథంలో సంఘం

ములకలపల్లి: 600 మంది సంఘ సభ్యులతో మూకమామిడి రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రగతిపథంలో ముందుకు సాగుతోందని కరుటూరి కృష్ణ అన్నారు. సంఘ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన.. మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ అనుసంధానంతో ఏర్పాటైన ఈ సంఘం ద్వారా సంఘ సభ్యులకు, రైతులకు అతితక్కువ ధరలకే ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఏడీఎస్ నుంచి కోఆర్డినేటర్లు రవిశంకర్, భానుప్రసాద్, బోర్డాఫ్ డైరెక్టర్లు గాదె సత్యనారాయణ, సున్నం బుచ్చిబాబు. పర్వనేని అమర్‌నాథ్, నరుకుళ్ల రంగారావు, తేళ్ల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### విజయవంతం చేయండి

ములకలపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 27న నిర్వహించనున్న సంయుక్త కిసాన్ మోర్చా మండల సదస్సును విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నూపా భాస్కర్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం జిల్లా కార్యదర్శి కల్లూరి కిషోర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎండి.యూసఫ్, రైతుసంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ముదిగొండ రాంబాబు, నాయకులు పోతుగంటి లక్ష్మణ్. కల్లూరి పద్మ, సీహెచ్.వెంకటేశ్వర్లు, గద్దం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం

చర్లరూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు ఆర్థిక సాయమందించారు ఆ ఊరి గ్రామస్తులు. చర్ల మండలం గొమ్ముగూడెం గ్రామానికి చెందిన పూజారి ఆదిలక్ష్మి అనే మహిళ భర్తను కోల్పోయి ఇబ్బందులు పడుతున్న సమయంలో కాళ్లు చచ్చుబడి అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో అదే గ్రామస్తులు చికిత్స కోసం రూ.26,800లను సర్పంచ్ పొడియం మురళి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పోట్రు బ్రహ్మానందరెడ్డి, దినసరి భాస్కర రెడ్డి, సంకపాప ప్రభాకర్, పూజారి రమణ, సంతపురి సతీష్, తడికెల వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి బి.శోభన్ బాబు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ వైపు అడుగులు!

- మండలాల్లో ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- సంప్రదాయ పంటలకు బదులు వాణిజ్య పంటలపై రైతుల ఆసక్తి
- కలిసి వస్తున్న ప్రభుత్వ ప్రోత్సాహకాలు



తోటను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు (ఫైల్)



మండలంలో ఓ రైతు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోట

సండే స్పెషల్

గుండాల: ఇంతకాలం పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలు సాగు చేసిన రైతులు పొద్దుతిరుగుడుతో పాటు మరో అడుగు ముందుకు వేస్తున్నారు.. అధిక దిగుబడిని ఇచ్చే దీర్ఘకాలిక పంటైన ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించారు. కరెంటు, నీటి సదుపాయం ఉన్న రైతులు సబ్సిడీపై ఆయిల్‌పామ్ మొక్కలను తీసుకుని సాగు చేస్తున్నారు. ఈ తోటలో అంతర పంటలు సైతం సాగు చేసే అవకాశం ఉండడంతో ఏటా సాగు విస్తీర్ణం గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో పెరుగుతోంది. ఇప్పటివరకు గుండాల మండలంలో 18 మంది రైతులు 95 ఎకరాల్లో, ఆళ్లపల్లి మండలంలో 34 మంది రైతులు 130 ఎకరాల్లో ఆయిల్‌పామ్ నాటారు. ఈ తోటలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్న విషయాన్ని ఉద్యానవన శాఖ అధికారులు గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తుండడంతో పలువురు ముందుకొస్తున్నారు.

**ఎకరానికి 57 మొక్కలు**

ఆయిల్‌పామ్ పంటల సాగుకు అనువైన నేలలు మండలంలో ఉండడంతో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఒక్కో మొక్క రూ.200 ఉండగా, సబ్సిడీపై రూ.20కే ఇస్తున్నారు. ఎకరానికి 57 మొక్కల చొప్పున నాటుతున్నారు. నాటిన నాలుగేళ్లలో పంట చేతికి వస్తోంది. ఆసక్తి ఉన్న రైతులు ఆధార్, పట్టా పాస్ పుస్తకం, బ్యాంకు అకౌంట్ వివరాలతో ఉద్యానశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే రిజిస్ట్రేషన్ చేసి అవసరమైన మొక్కలు పంపిణీ చేస్తారు.

**రైతు ఖాతాల్లోకి పెట్టుబడి**

ఆయిల్‌పామ్ సాగుకు ముందుకొచ్చే రైతులకు ప్రభుత్వం అన్నిరకాలుగా అండగా నిలుస్తోంది. నాలుగేళ్ల పాటు ఏటా ఎకరాకు సాగు ఖర్చుల కోసం రూ.4,200 రైతు ఖాతాలో జమ చేస్తున్నారు. అలాగే, దిగుబడి వచ్చాక పంటను కొనుకోలు కేంద్రాలకు తరలించేందుకు రవాణా చార్జీలు సైతం చెల్లించనున్నారు. 15 కిలోమీటర్ల దూరానికి రూ.370, 30 కిలోమీటర్ల వరకు రూ.460, 80 నుంచి 100 కిలో మీటర్ల వరకు రూ.900 మేర చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు.

**అంతర పంటలు సాగు**

రైతులు ఆయిల్‌పామ్ మొక్కలు నాటితే నాలుగేళ్ల తర్వాత పంట చేతికొస్తుంది. అప్పటి వరకు అంతర పంటలు సాగు చేసుకునే అవకాశముంది. దీంతో పలువురు రైతులు ఈ పంటపై ఆసక్తిగా ఉన్నారు. ఇప్పటికే పత్తి, కంది, మిర్చి, తీగ మొక్కలు, కూరగాయలు తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం పోడు రైతులకు పట్టాలు ఇవ్వడంతో పాటు గిరివికాస్ కింద ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించింది. దీంతో గిరిజన గ్రామాల్లో బోర్లు వేసుకుని ఆయిల్‌పామ్ సాగుకు సిద్ధం అవుతున్నారు.

**పంట ఏపుగా పెరుగుతోంది..**



ఐదు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నాను. ఇప్పటికే మొక్కలు నాటి రెండు సంవత్సరాలు గడుస్తోంది. ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చెట్లు బాగానే పెరుగుతున్నాయి. అధికారులు ఇచ్చే సూచనల మేరకు ముందుకు సాగుతున్నాం.

– వి.నర్సింహారావు, కొమ్ముగూడెం

**అంతర పంటలు వేశా..**



ఐదు ఎకరాల్లో రెండేళ్ల కింద ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఇప్పుడు ఏపుగా పెరుగుతున్నాయి. అంతర పంటలు సాగు చేస్తున్నా. ఇదివరకు మొక్కజొన్న, పత్తి అంతర పంటగా సాగు చేశాను. ఈ ఏడాది మొక్కజొన్న వేయాలనుకుంటున్నా.

– హరిబాబు, గుండాల

**అవగాహన కల్పిస్తున్నాం..**



ఆసక్తి ఉన్న రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో నేలలు అనుకూలంగా ఉండగా, నీటి వనరులు సైతం ఉన్నాయి. అంతర పంటలు సాగుకు అవకాశమున్నందున రైతులు ముందుకు రావాలి.

– సిద్ధార్థ, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్

## ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడి



భద్రాచలంటౌన్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

భద్రాచలంటౌన్: పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే పొదెం వీరయ్య క్యాంపు కార్యాలయాన్ని శనివారం అంగన్‌వాడీలు ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో ముట్టడించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరయ్య మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను ఆదుకునే విధంగా సీఎం కేసీఆర్ దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నరాటి ప్రసాద్, బ్రహ్మాచారి, ఆకోజు సునీల్, మల్లికార్జున్, రామిరెడ్డి, నర్సారెడి తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి**

బూర్గంపాడు: అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నారటి ప్రసాద్ డిమాండ్ చేశారు. బూర్గంపాడు ప్రధానకూడలిలో అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన సమ్మె శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, రెడ్డి అరుణ, వెంకటరమణ, శ్రీదేవి,రచన, రజని తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే విస్తృత పర్యటన

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శనివారం విస్తృతంగా పర్యటించారు. నాయుడుపేట, గండుగులపల్లి, లింగాలపల్లి, మల్కారం, మందలపల్లి, మల్లారం, వెంకటాద్రిగూడెం తదితర గ్రామాల్లో గణేష్ మండపాలను సందర్శించారు. పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాలను వడ్డించారు. మల్కారం గ్రామంలో మండపాల వద్ద నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. పర్యటనలో గ్రామస్తులు, మహిళలతో కాసేపు ముచ్చటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తాండ్ర మహేశ్వరరావును పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, అంకత మహేశ్వరరావు, జలగం వాసు, సర్పంచ్ రూప్‌సింగ్, అబ్దుల్ జిన్నా, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధిపై నిర్లక్ష్యం వీడాలి

అశ్వాపురం: ఏజెన్సీ గ్రామాల అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యం వీడాలని విద్య, వైద్యం, రహదారులు, కరెంటు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్.మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామాలు, మారుమూల ప్రాంతాలైన మనుబోతులగూడెం, మామిళ్లవాయి గ్రామాలను ప్రజాపంథా నాయకులు శనివారం సందర్శించి గిరిజనులతో మాట్లాడారు. సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆదివాసీలకు తాగునీరు వంటి కనీస సౌకర్యాలు అందడం లేదని, పోడుకు పట్టాలు, కుల ధృవీకరణ పత్రాలు పొందలేకపోతున్నారని అన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 25న చలో ఐటీడీఏ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోరెం బుచ్చిరాములు, కోళ్ల వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరణ

దమ్మపేట: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా వీరభద్ర నాయక్ నూతనంగా బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం తహసీల్దార్‌గా విధులు నిర్వరిస్తున్న ముజాహిద్, అనారోగ్య కారణంగా సెలవుపై వెళ్లడంతో శనివారం మండల తహసీల్‌లో వీరభద్ర నాయక్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

### ఫోన్ అప్పగింత

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామానికి చెందిన నక్కా శరత్ తన ఫోన్ పోగొట్టుకోగా.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ రికవరీ చేసి ఎస్ఐ గణేష్ అతనికి అందజేశారు. ప్రజలు ఎవరైనా తమ స్మార్ట్ ఫోన్‌లను పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలు అందజేసి ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించారు.

### రోడ్లకు మరమ్మతులు

మణుగూరురూరల్: మణుగూరు-ఏటూరు నాగారం ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను మణుగూరు సీఐ బాలాజీ వరప్రసాద్ చొరవ తీసుకుని శనివారం మరమ్మతులు నిర్వహించారు. ఎవరూ ప్రమాదబారిన పడకుండా తగిన మరమ్మతు పనులను చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్త చేశారు.

### ఉచిత వైద్య శిబిరాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుంటిమడుగు గిరిజన గ్రామంలో శనివారం వినాయకపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ ఆధ్వర్యంలో 32 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి నలుగురు జ్వర పీడితులను గుర్తించారు. జ్వరాలతో బాధ పడుతున్న వారికి ఆర్‌డీటీ రక్త పరీక్షలు చేయగా, మలేరియా నిర్ధారణ కాలేదని వైద్యాధికారి తెలిపారు. అనంతరం గ్రామస్తులకు దోమ తెరల వినియోగం, పరిసరాల పరిశుభ్రత, టైఫాయిడ్ జ్వరాలపై అవగాహన కల్పించారు. సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, సిబ్బంది రవి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: ఆరోగ్యకర జీవనం కోసం ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించాలని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ సూచించారు. మండల పరిధిలోని రేగులగండి, పెద్దిపల్లి గ్రామాలు, పట్టణంలోని మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ వెల్ఫేర్ బాలికల వసతి గృహంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ వైద్యశిబిరాల్లో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ గ్రామస్తులకు, విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. అనంతరం వసతిగృహ విద్యార్థినులకు ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో సమతూల్య ఆహారంపై అవగాహన కల్పించారు. సీహెచ్ఓ వెంకటేశ్వరరావు, రాంప్రసాద్ ఉమేష్, ఏవి.లక్ష్మి, రాధ, అనసూర్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయకుడి నిమజ్జనం

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని హనుమాన్‌బజార్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాన్ని శనివారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఐదు రోజులపాటు భక్తిశ్రద్ధలతో గణేషుడికి పూజలు చేశారు. సమీపంలోని గంటే వీరయ్యకుంటలో నిమజ్జన కార్యక్రమం జరిగింది.

అశ్వారావుపేటరూరల్: వినాయక చవితి సందర్భంగా కొలువుదీరిన గణనాథుల విగ్రహాలను ఐదో రోజు శనివారం పలు చోట్ల ఘనంగా ఊరేగింపుగా తరలించారు. మండలంలోని నారాయణపురం కాలనీ, నారాయణపురం, రెడ్డిగూడెం, నందిపాడు, ఊసిర్లగూడెంతోపాటు అశ్వారావుపేటలోని కొలువుదీరిన వినాయక విగ్రహాలను ట్రాక్టర్లలో వైభవంగా ప్రధాన రహదారులు, పురవీధుల్లో ఊరేగించారు. తీన్మార్ డప్పు నృత్యాలతో యువకులు సందడి చేయగా.. పులిహార, ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల సమీపంలో ఉన్న చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

**మండపంలో అన్నదానం..**

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఎంపీ కాలనీలోని వినాయక మండపం వద్ద ఉత్సవ కమిటీ, సాగర్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కాలనీ వాసులతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజాపత్ దయారాం, నక్క ప్రసాద్, ఎంపీ కాలనీ యువకులు తదితరులు పాల్గొన్నారు.



మణుగూరుటౌన్: పట్టణంలో గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని భగత్ సింగ్‌నగర్, రాజుపేట, శ్రీశ్రీనగర్, సుందరయ్యనగర్, శేషగిరినగర్, కమలాపురం, రాయిగూడెం, కాళీమాత, గాంధీనగర్ తదితర ఏరియాలలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథులను నిమజ్జనాలకు ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానాలు నిర్వహించి డప్పు వాయిద్యాలతో, తాటాకు చప్పుల్లతో, నృత్యాలతో కేరింతల నడుమ గణనాథులను గోదావరి చెంతకు చేర్చారు. ఎస్సై శ్రీనివాస్, రాజేశ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఊరేగింపులను పర్యవేక్షించారు.

## ప్రజా సమస్యలపై ర్యాలీ, ధర్నా



భద్రాచలంటౌన్: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలోని వలస ఆదివాసులకు మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అములులో వివక్షత చూపకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించి పీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోడు భూములలో వలస ఆదివాసీలకు పట్టాలు పంపిణీ చేయాలని, ప్రభుత్వ పథకాలు ఆదివాసులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ముందుగా పట్టణంలోని పార్టీ కార్యాయలం నుంచి ఐటీడీఏ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మచ్చ వెంకటేశ్వర్లు, ఎంబీ నర్సారెడ్డి, బ్రహ్మాచారి, సత్యనారాయణ, చంద్రయ్య, చిలకమ్మ, వెంకన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: వలస ఆదివాసీలకు మౌలిక సదుపాయల కల్పన కోసం శనివారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చలో ఐటీడీఏ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా.. మండల నాయకులు కార్యక్రమంలో పాల్గొని ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు స్థానిక నాయకులు వివరాలు వెల్లడించారు. అంతర్గత రోడ్లు, విద్య, వైద్యం, తాగునీరు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కొమరం కాంతారావు, కనితి రాము, నాయకులు మడివి లక్ష్మయ్య, కనితి సుందరయ్య, మడకం చందు, పొడియం లక్ష్మయ్య, తాటి దేవరయ్య, పలు గ్రామాల వలస ఆదివాసీలు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా రహదారి పనులు



మామిళ్లవాయి రహదారిపై గుంతలు పూడ్చుతున్న స్థానిక గిరిజనులు

అశ్వాపురం: తమ గ్రామానికి రహదారి నిర్మించాలని మండల పరిధిలోని గిరిజన గ్రామమైన మామిళ్లవాయి వాసులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నారు. శనివారం మామిళ్లవాయి రహదారిపై గ్రామస్తులు స్వచ్ఛందంగా గుంతలను రాళ్లు, మట్టితో పూడ్చారు. రహదారి సమస్యపై ఎవరూ పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. తమ గ్రామానికి పీహెచ్‌సీ 30 కిలోమీటర్లు, ఏరియా ఆస్పత్రి 50 కిలోమీటర్లు దూరం ఉందని.. పాము కరిచినా, ప్రాణాపాయం కలిగినా, గర్భిణులు డెలివరీకి వెళ్లాలన్నా ఆస్పత్రికి వెళ్లడానికి రహదారి సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 102, 108 వాహనాలు రావడానికి రహదారి బాలేక చాలా ఆలస్యం అవుతోందన్నారు. జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానిక గిరిజనులు కోరారు.

## ప్రజల గొంతు ఎండిపోతోంది..

దుమ్ముగూడెం: మండలంలోని వైట్ నాగారం గ్రామ పంచాయతీ ప్రజలు మంచినీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే వారికి తాగునీరు అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

శనివారం పంచాయతీలో పర్యటించిన సీపీఎం బృందం.. అక్కడి సమస్యలను గుర్తించింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వైట్ నాగరం గ్రామానికి మిషన్ భగీరథ మంచినీళ్లు ఇంత వరకు రాలేదని, గతంలో ఐటీడీఏ పీఓకి ఈ సమస్యపై అనేకసార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేదని అన్నారు. వెంటనే తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముత్యాలరావు, వేల్పుల పంచారావ్, చలమయ్య, సింగయ్య, అపక పాపారావు, ఇర్ప చంద్రయ్య, వేల్పుల తిరపతమ్మ, వేల్పుల రాజమ్మ, భద్రమ్మ, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమ్మె నోటీస్



దమ్మపేట: ఎంపీడీఓ కార్యాలయంలో సమ్మె నోటీస్ అందజేస్తున్న జీపీ కార్మికులు

దమ్మపేట: మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్మికులు, స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమ్మె నోటీస్‌ను శనివారం ఎంపీడీఓ కార్యాలయంలోని సూపరింటెండెంట్ విద్యాధరరావుకు అందజేశారు. మాట్లాడుతూ.. రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు ఇచ్చిన హామీల మేరకు గతంలో సమ్మెను విరమించగా, నేటికి ఆ హామీలను నెరవేర్చలేదని వాపోయారు. మంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే అక్టోబర్ 2వ తేదీ నుంచి సమ్మెను ప్రారంభించనున్నామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో గత కొద్దిరోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు, పంచాయతీ కార్మికులు సంఘీభావం ప్రకటించారు. కార్మిక నాయకులు బెజవాడ రాము, ధర్మ, తిమ్మరాజు అన్నవరం, సింగ్, రామకృష్ణ, రాంబాబు, నాగమణి, జ్యోతి పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల సమస్యలను పరిష్కారం కొరకు ఈ నెల 28 నుంచి సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కార్మికులు స్థానిక ఎంఈఓకి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో గత 20 ఏళ్లుగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్న కార్మికుల పట్ల వివక్ష చూపడం సరికాదన్నారు. కార్యక్రమంలో మర్లపాటి రేణుక, లక్ష్మీకాంత్, పిలకా శివకుమారి, రమాదేవి, సత్యవతి, నాగమణి, విజయ, కృష్ణవేణి, సుధా, నాగమణి, విజయ పాల్గొన్నారు.

## వంద రోజుల్లో అమలు చేస్తాం



చండ్రుగొండ: ప్రచారంలో భాగంగా ట్రాక్టర్ నడుపుతున్న తాటి వెంకటేశ్వర్లు

చండ్రుగొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే పార్టీ అగ్రనాయకురాలు సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే, పీసీసీ కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు చెప్పారు. మండలకేంద్రం చండ్రుగొండలో శనివారం ఆరు గ్యారంటీ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి, షాపు షాపుకూ తిరిగిన ఆయన.. టిఫిన్ సెంటర్ వద్ద బోండాలు కాల్చుతూ యజమాని అయిన మహిళతో మాట్లాడారు. 3 నెలల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని నీ కష్టాలు పోతాయని భరోసా ఇచ్చారు. అనంతరం అయన్నపాలెం గ్రామంలో లక్ష్మీగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పథకాల గురించి వివరించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ గుగులోతు బాబు, మాజీ సర్పంచ్ రుక్మిణి, నాయకులు యండి.సాబీర్‌హుసేన్, నల్లమోతు రమణ, పొన్నెబోయిన భిక్షమయ్య, కె.నర్సింహారావు, ఎస్‌కె.మదార్‌సాబ్, జాకీర్, ఉపసర్పంచ్ డి.రామారావు, సంకా కృపాకర్, ఇంజం అప్పారావు, బొర్రా సురేష్ పాల్గొన్నారు.

దమ్మపేట: తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు జారే ఆదినారాయణ ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఆయన.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయ పాలన అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాట్టా శివాజీ, వెంకటేష్, బాబురావు, కిరణ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండలకేంద్రంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఆరు పథకాల అమలును వివరిస్తూ, గ్యారెంటీ కార్డులను గడపగడపకూ ప్రచారం చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి, ములకలపల్లి, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట మండలాల కాంగ్రెస్ అధ్యక్షుడు, తాండ్ర ప్రభాకర్‌రావు, మద్దిశెట్టి సత్యప్రసాద్, వనమా గాంధీ, తుమ్మ రాంబాబు, పాలకుర్తి సుమిత్, బూరుగుపల్లి పద్మశ్రీ పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేటలో 11వ రోజు గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు పాయం వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేయబోయే పథకాలను, వరంగల్ రైతు డిక్లరేషన్, చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, ఆరు గ్యారెంటీ కార్డులను వివరించారు. ఈ సందర్భంగా స్థానిక కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పాయం కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేవీరావు, ఉపసర్పంచ్‌లు పుచ్చకాయల శంకర్, గోరంట్ల కనకయ్య, వీరంకి వెంకట్రావ్, నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, కుర్రం రవి, మాదాడి రాజేశ్, పాతూరి వెంకన్న, సురేశ్, మానస, నగేశ్, మహేశ్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గాంప్రసాద్ - 79979 58226 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి - పాఠక మహాశయులకు విజ్ఞప్తి - Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండంత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416